క్లుప్తంగా

4 గంటల వరకే ఓటింగ్

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ నాలుగు గంటల వరకే కొనసాగుతుంది. భద్రాచలం నియోజకవర్గంలోని 276 పోలింగ్ కేంద్రాలకు గాను 221 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడంతో అధికారులు పోలింగ్ సిబ్బంది త్వరగా సురక్షిత ప్రాంతాలకు చేరుకునేందుకు అధికారులు నాలుగు గంటల వరకే పోలింగ్ నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు. అసలు గతంలో సాయంత్రం ఐదు గంటల వరకే అధికారులు ఎన్నికల సందర్భంగా ఓటింగ్ ప్రక్రియను నిర్వహించే వారు కాని ఈ ఏడాది రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మరో గంట పెంచి ఆరు గంటల వరకు నిర్ణయించారు. భద్రాచలం నియోజకవర్గం మావోల ప్రభావం ఎక్కువగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యానికి సరిహద్దులో ఉండడంతో అధికారులు అప్రమత్తమైన్నారు. అందులో ఇటీవల్లే వాజేడు మండలంలో పలు చోట్ల పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని మావోలు కరపత్రాలు వదిలారు. ఇటువంటి ఘటనలను దృష్టిలో ఉంచుకోని ఎన్నికల అధికారులు, పోలీసులు భద్రాచలం నియోజకవర్గంలో నాలుగు గంటల వరకే ఎన్నికల నిర్వహన జరుగుతుందని, ప్రజలు తమ ఓటు హక్కును ఈ సమయంలోనే వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

హై పవర్ వేతనాలపై చర్చించాలి

మణుగూరుటౌన్: పార్లమెంట్‌కు ఎంపికై న మరుక్షణం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హైపవర్ కమిటీ వేతనాల అమలు కోసం పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతూ ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌కు ఆదివారం ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్ వినతిపత్రం అందజేశారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బలరాం నాయక్‌ను కలిసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వివరించారు. 2013 ఏప్రిల్ 1 నుంచి దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాల అమలుకు ఆదేశాలున్నప్పటికీ సింగరేణిలో ఇప్పటి వరకు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్య పరిష్కారం అవుతుందేమోనన్న ఆశతో కాంట్రాక్ట్ కార్మికులు ఎదురుచూస్తున్నారన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని మణుగూరు సమీప ఆదివాసీ, గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసే విధంగా మణుగూరు సమీప గ్రామాలఅభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తి, శివరామకృష్ణ, శ్రీనివాస్, రాము, కాంతారావు తదితరులు ఉన్నారు.

మంత్రి పొంగులేటికి సన్మానం

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం అశ్వారావుపేటలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా రింగ్ రోడ్ సెంటర్‌లోని సీపీఐ కార్యాలయానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి వెళ్లారు. కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులను కలిసి మాట్లాడారు. అనంతరం సీపీఎం, సీపీఐ నాయకులు మంత్రిని శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ, సీపీఐ నాయకులు ఎస్‌డీ సలీం, గన్నిన రామకృష్ణ, సీపీఎం నాయకులు కె.పుల్లయ్య పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

భద్రాచలంటౌన్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, మదర్స్ డే సందర్భంగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని నవజాత శిశువులకు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నర్సు దుర్గ భవాని చేతులు మీదుగా దుస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక్కొక్క శిశువుకి రెండు జతలు చొప్పున 30 మందికి దుస్తులు పంపిణీ చేసిన మదర్ థెరిస్సా ట్రస్ట్ నిర్వాహకుల సేవలను ఆయన అభినందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, ట్రస్ట్ సభ్యులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, నవీన్, సాయి కుమార్, జయరాం, కృష్ణవేణి పాల్గొన్నారు.

సోయం గంగులు వర్ధంతి

దమ్మపేట: ఆదివాసీ పోరాట యోధుడు సోయం గంగులు వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సోయం గంగులు వర్ధంతిని పురస్కరించుకొని దమ్మపేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వర్లు ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాటి మాట్లాడుతూ.. నిజాం సైన్యం, జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన ఆదివాసీ బిడ్డ సోయం గంగులు అని అన్నారు. నాయకులు సోయం వీరభద్రం, వెంకటేష్, రామారావు, రామ్మూర్తి, వెంకటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల సామగ్రి అందుకున్న సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పక్కా వ్యూహంతో పోలీస్ శాఖ


ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమయ్యాయి. మణుగూరు జెడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ వద్ద నుండి ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలు పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్నాయి. పినపాక నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో ఈ యంత్రాలు ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేసి వాహనాల ద్వారా వారి వారి పోలింగ్ కేంద్రాలకు తరలించారు. నియోజకవర్గానికి 24,450 పోలింగ్ కేంద్రాలను కేటాయించగా.. 2,03,790 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1300 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ సిబ్బందికి యంత్రాల పంపిణీ అనంతరం ప్రత్యేక వాహనాలలో ఎస్కార్ట్ ద్వారా కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి అధికారులు సకల సదుపాయాలు కల్పించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిలు సందర్శించి పరిశీలించారు. పోలీసులకు భద్రత చర్యల పట్ల పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ ఓటర్ నమోదు అధికారి, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎలక్షన్ డీటీ నాగరాజు, తహసీల్దార్లు పి.నాగరాజు, సూర్యనారాయణ, స్వర్ణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రాజేష్, ప్రసాద్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఆదివారం ఆమె అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని, ఏలాంటి భయందోళన లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పూర్తి స్థాయిలో అందించామని, పోలీస్ భద్రతలో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించామని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే తాగనీరు, విద్యుత్, ర్యాంప్‌లతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఓటర్లతోపాటు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాల్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు బూర్గంపాడు మండలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తహసీల్దార్ ముజాహిద్ తెలిపారు. ఒక పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాన్ని, ఒక మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 49,813 ఓటర్లు ఉన్నారని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి: సోమవారం జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు అధికారులు మండలంలో సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 20 బూత్‌లలో 8247 మంది మహిళలు, 8381 పురుషులు మొత్తంగా 16628 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఆదివారం పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు.సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మండలంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ములకలపల్లి: లోక్‌సభ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలపరిధిలో 27,855 మంది ఓటర్లు ఉండగా, 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బూత్‌కు పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలను నియమించారు. అశ్వారావుపేట నుంచి పోలింగ్ సామగ్రి పోలింగ్ కేంద్రాలకే చేరింది. ఎండ వేడిమి నేపథ్యంలో కేంద్రాల వద్ద షామియానాలు వేశారు. తాగునీరు అందుబాటులో ఉంచారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహనకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. భద్రాచలం డిగ్రీ కళాశాలలో నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆదివారం ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఎన్నికల నిర్వాహన సిబ్బందిని తరలించేందుకు అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను అధికారు పూర్తి చేశారు. భద్రాచలం నియోజకర్గంలోని ఐదు మండలాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 276, ఇంతులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 221, మోడల్ పోలింగ్ కేంద్రాలు 4 ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిని తెలుసుకునే విధంగా వెబ్ కాస్ట్ కెమోరాలను ఏర్పాటు చేసి జిల్లా అధికారులు అనునిత్యం పర్యవేక్షించే విధంగా ఏర్పాటు చేశారు. సమస్యత్మక పోలింగ్ కేంద్రాలలో పోలీసులు అధికారులు అదనపు బలగాలను మోహరించి పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల సరళిని భద్రాచలం ఆర్డీవో దామోదరావు, ఏఎస్పీ పరితోష్ పంకజ్‌లు పర్యవేక్షస్తున్నారు. భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల సామగ్రిని సెక్టర్ల వారీగా పోలీసు బందోబస్తుతో వెళ్తున్న వాహనాలను ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బస్సులను ఏర్పాటు చేసి 176 పోలింగ్ స్టేషన్లకు గాను 25 మంది సెక్టర్ అధికారులు, 120 మంది మైక్రో అబ్జర్వర్లు, ప్రతి పోలింగ్ స్టేషన్‌కు పీఓలు, ఏపీవోలు, ఓపీఓలు, రిజర్వుగా పోలింగ్ సిబ్బందితో 844 మందిని నియమించడం జరిగిందని వివరించారు.

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలం నేడు జరుగనున్న ఎంపీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం మండల కేంద్రానికి ఎన్నికల అధికారులు వారి సామాగ్రితో చేరుకున్నారు. ఆళ్లపల్లి మండలంలో 7 పోలింగ్ కేంద్రాల్లో 11 బూత్‌లను గానూ 8 వేల681 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గుండాలలో మండలంలో 14 పోలింగ్ కేంద్రాలు,17 బూతులు ఉండగా 13వేల150 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోకున్నారు. బ్యాలెట్ బ్యాక్సులు,ఈవిఎం మిషన్లు, వివిధ సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అందజేశారు. అధికారులతో పాటు, సామగ్రిని మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేవిధంగా పోలీసులు ప్రత్యేక బంధోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

అశ్వాపురం: మండలంలో 41 పోలింగ్ కేంద్రాలలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎండల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద నీడ, మంచినీరు సౌకర్యానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

సరిహద్దు పోలింగ్ కేంద్రాల వద్ద..

చర్లరూరల్: నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా.. చర్ల మండలంలోని ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఒకటైన తిప్పాపురం పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు ఆదివారం ఏర్పాట్లు చేశారు. చర్ల మండలంలోనే అత్యధికంగా తిప్పాపురం పోలింగ్ కేంద్రంలో పురుషులు 694, స్త్రీలు 683 మొత్తం 1377 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.వేసవికాలం కావడంతో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రం వద్ద టెంట్లు, మంచినీళ్ల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తిప్పాపురం పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె.రఫి తెలిపారు. అంతేకాకుండా తిప్పాపురం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు రవాణా సౌకర్యం కూడా కల్పించనున్నారు.

భారీ భద్రత నడుమ..

చర్ల: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆదివారం భారీ భద్రత నడుమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని పలు మారుమూల, అటవీ ప్రాంత గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలలో పోలింగ్ సామగ్రి, అధికారులు, సిబ్బందిని సాయంత్రం 4 గంటల లోపే తరలించి పోలీసు అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలను పూర్తిగా వారి ఆధీనంలోకి తీసుకున్నారు. అంకంటే ముందు రెండు రోజుల నుంచే ఆయా మార్గాలపై మావోయిస్టులు మందుపాతరలను ఏర్పాటు చేయవచ్చునన్న అనుమానంతో రహదారులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చర్ల మండలంలోని ఉంజుపల్లి, తిప్పాపురం పెదమిడిసిలేరు దుమ్ముగూడెం మండలంలోని పొరారం, పైదిగూడెం, మారాయిగూడెం, రామచంద్రునిపేట, లచ్చిగూడెం, నారాయణరావుపేట, కొత్తపల్లి తదితర గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలకు సీఐలు రాజువర్మ, అశోక్‌ల నేతృత్వంలో బారీ భద్రత నడుమ ఎన్నికల అధికారులు, సిబ్బందిని, సామగ్రిని తరలించారు. ఎన్నికల నేపథ్యంలో గత వారం రోజుల నుంచి సరిహద్దు ప్రాంతాన్ని ప్రత్యేక పోలీసు బలగాలు జల్లెడ పడుతుండగా, పోలింగ్ కేంద్రాలను సీఆర్‌పీఎఫ్, స్పెషల్‌పార్టీ బలగాలు ఆదీనంలోకి తీసుకున్నాయి. గతంలో జరిగిన శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.


మణుగూరురూరల్: సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్


భద్రాచలంటౌన్: డిగ్రీ కళాశాలలో సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేస్తున్న అధికారులు


మణుగూరురూరల్: యంత్రాల పంపిణీని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజ్


భద్రాచలంటౌన్: జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీఓ, ఏఎస్పీ


అశ్వారావుపేటరూరల్: బస్సు ఎక్కుతున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

గ్రామాల్లో జోరు వర్షం


అశ్వారావుపేటరూరల్: కొత్తూరు పోలింగ్ కేంద్రంలో వర్షంతో తడుస్తున్న టెంట్‌లు

అశ్వారావుపేటరూరల్: పలు గిరిజన గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్న సమయంలో గాలి దుమారంతోపాటు జోరుగా వర్షం కురిసింది. మండలంలోని మామిళ్లవారిగూడెం, కొత్త మామిళ్లవారిగూడెం, ఆసుపాక, నందిపాడు, కోయ రంగాపురం, వడ్డెర రంగాపురం, గుమ్మడవల్లి, కొత్తూరు, బచ్చువారిగూడెం, నారాయణపురం, నారాయణపురం కాలనీ, నెమలిపేట, పెంచికలపాడు, మల్లాయిగూడెం, దబ్బతోగు, పండువారిగూడెం, దిబ్బగూడెంతోపాటు మరికొన్ని గ్రామాల్లో వాతావరణం చల్లబడి గాలి దుమారంతోపాటు జోరుగా వర్షం కురిసింది. గాలి దుమారం కారణంగా మామిడి తోటల్లో చేతికందిన కాయలు నేలరాలగా రైతులు లబోదిబోమంటున్నారు. అలాగే పలు చోట్ల వేరుశనగ కాయలు కోతలు పూర్తి కాగా, కాయలు ఆరబోశారు. అకాల వర్షంతో వేరుశనగ కాయలు తడవకుండా బరకాలు కప్పారు. అలాగే ధాన్యం కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం రాశులపై కూడా బరకాలు కప్పి వర్షంలో తడవకుండా కాపాడుకున్నారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాల్లోని టెంట్‌లు గాలి దుమారంతో కింద పడిపోగా, వర్షంలో తడిసిపోయాయి. వర్షం తగ్గిన తర్వాత మళ్లి వాటిని పునురుద్ధరించే పనుల్లో సిబ్బంది నిమగ్నం అయ్యారు.

గుండాల: మండలంలో ఈదురు గాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి ఈదురు గాలులు రావడంతో పలు చోట్ల ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు కొమ్మలు, చెట్లు విరిగిపడ్డాయి. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. సుమారు రెండు మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పిడుగుపాట్లకు స్థానికులు తీవ్ర భయాందోళనలు చెందారు. అడుగు బయటపెట్టకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. కరెంటుకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఎన్నికలు జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తుండగా గాలిదుమారం సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసింది. కాగా మండల కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాక వర్షం ప్రారంభమయింది.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ పనులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా, నాసిరకంగా జరుగుతున్నాయి. ఆదివారం జరుగుతున్న డ్రెయినేజీ పనుల్లో నీరు నిల్వ ఉన్న గుంతల్లో కాంక్రీట్ వేసి డ్రెయినేజీ నిర్మిస్తున్నారు.

డ్రెయినేజీ మధ్య మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో స్థంభాలు తీయకుండా డ్రెయినేజీ ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తున్నారు. డ్రెయినేజీ ఎంతో కాలంగా అసంపూర్తిగా చేపడుతుండటంతో దుకాణాలకు వచ్చే వారు డ్రెయినేజీ గుంతల వల్ల గాయాలపాలవుతున్నారు. గుంతల్లో దోమలు విజృంభించి మురికి కూపంగా ఉండి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ పనులు తక్షణమే పూర్తి చేయాలని నాణ్యతతో డ్రెయినేజీ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మొండికుంటలో అస్తవ్యస్తంగా కొనసాగుతున్న డ్రెయినేజీ పనులు

ఆకర్షణీయంగా ఆదర్శ పోలింగ్ కేంద్రాలు



మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం..

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కేంద్రాన్ని మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంగా, పాత ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోగల స్త్రీశక్తి భవనం కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా, అదే విధంగా మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కేంద్రాన్ని దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం, నారాయణపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని యూత్ ఆదర్శ కేంద్రంగా ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడంతోపాటు.. ప్రత్యేకంగా హోర్డింగ్‌లు పెట్టి, ఆవరణలో రంగు వల్లులు, అరటి, మామిడి తోరణాలతో అలంకరించారు. ఆయా కేంద్రాల్లో ప్రత్యేకంగా కేటాయించిన ఓటర్లే తమ ఓటు హక్కును వినియోగించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణ ఉన్నాయి.

ఆలయాల్లో భక్తుల పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, గోగులపూడి అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అలాగే మొక్కులు చెల్లించి, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది.

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలి

భద్రాచలంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి భద్రాచలం డివిజన్ లో గల 117 పోలింగ్ కేంద్రాలలో భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను ఏర్పాటు చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. భద్రాచలం డివిజన్ ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, భద్రాచలం డివిజన్ లో 1300 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగబోయే ఓటింగ్‌లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచార బోర్డులు, లౌడ్ స్పీకర్ లు ఏర్పాటు చేయకూడదని, పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదని, ప్రజలంతా ఇట్టి విషయాన్ని గమనించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే వారి పై చర్యలు తీసుకుంటామని ఎన్నికల సందర్భంగా ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలలో గానీ,పరిసర ప్రాంతాల్లో గానీ ఓటర్లను ప్రలోభ పెట్టి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం మరియు ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి గానీ, సీ-విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని తెలిపారు. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి


అన్నపురెడ్డిపల్లి: శంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు


భద్రాచలంటౌన్: రామానుజుల విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అన్నపురెడ్డిపల్లి: ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆదివారం మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో శంకరాచార్యుల చిత్రపటం వద్ద రుద్రపారాయణ, అర్చన తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. స్వామి వారి పూజ కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సంపత్ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని సంతానప్రద ఆంజనేయ ఆలయంలోని శంకర మఠంనందు ఆదిశంకర జయంతి మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశంకరులకు అభిషేకం, అర్చన, కామకోటి పీఠ స్వస్తివాచన గురువందన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భద్రాద్రి దేవస్థాన ఆస్థాన సామవేద పండితులు సన్యాసి శర్మ ఆదిశంకరుల అవతార విశిష్టతను భక్తులకు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మామిడిపండ్లు, విసనకర్రలు, స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గౌతమి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు రవికుమార్ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ, శ్రీపాద శ్రీకర్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రామానుజుల జయంతి..

భద్రాచలంటౌన్: భద్రాచలం రామాలయం రోడ్డులోని రామానుజుల వారి విగ్రహం వద్ద జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రామానుజుల వారి విగ్రహానికి పూజలు చేసి గజ పూలమాల వేశారు. అనంతరం విగ్రహ దాతలు డాక్టర్ సుదర్శన్‌రావు-జయభారతి దంపతులను ఘనంగా సన్మానించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థలసాయి స్థానాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులు, జీయర్ మఠం అధ్యక్షుడు వెంకటాచారి పాల్గొన్నారు.